ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
మంగళవారం | 28 ఏప్రిల్ , 2026 | పేజీలు : 07

## కామ్రేడ్ బాలకృష్ణచారి వర్దంతి వేడుకలు



**ప్రజాపక్షం/డిండి;** కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)కి తవక్లాపూర్ గ్రామ ప్రజలకు తంగేళ్లపల్లి బాలకృష్ణ చారి చేసిన సేవలు చిరస్మరణీయం అని సిపిఐ డిండి మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి అన్నారు. సోమవారం మండలంలోని తవక్లాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ కామ్రేడ్ బాలకృష్ణచారి వర్ధంతిని పురస్కరించుకొని ఆయన స్మారక స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి కనకాచారి, సినియర్‌నాయకులు గోరేటి వెంకటయ్యలు మాట్లాడుతూ బాలకృష్ణచారి పేదల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించి, గ్రామాభివృద్ధికి బాటలు వేశారని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కంకణబద్దులై పనిచేయాలని ఈసందర్భంగా పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి వంకేశ్వరం చక్రి, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నవీన్, శ్రీనయ్య, ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు వినయ్‌కుమార్, ఏఐవైఎఫ్ డిండి మండల అధ్యక్షులు నరేష్, ఆలయ్య, గోపాల్, మల్లేష్, రాములు, సాయిలమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** విద్యార్థులు బాగా చదివిఉన్నత స్థాయికి ఎదగాలని నల్లగొండ జిల్లా కలెక్టర్. బి చంద్రశేఖర్ అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా బాలల భద్రత రక్షణ,మత్తు పదార్థాలకు నో చెప్పండి అనే అంశంపై ఈ నెల 27 నుండి మే2 వరకు నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని శిశు సంరక్షణ సంస్థల్లో ఉన్న విద్యార్థులు ఉన్నతికి కృషి చేస్తామని కలెక్టర్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్‌ల్లో ఆశ్రయం పొందుతున్న 18 సంవత్సరాల లోపు బాల బాలికలకు గుర్తింపు పత్రాలు పంపిణీ చేశారు. జనన ధృవీకరణ పత్రాలు, కుల ధృవీకరణ పత్రాలు,నివాస ధృవీకరణ పత్రాలు,హెల్త్ కార్డులు, ఆధార్ కార్డులు, సేవింగ్ బ్యాంక్ ఖాతా పుస్తకాలను జిల్లా కలెక్టర్ బాలలకు అందజేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశు సంరక్షణ సంస్థల్లో అందిస్తున్న సౌకర్యాలను బాలలు సద్వినియోగం చేసుకొని బాగా చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.ఈకార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి,జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి,జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,జిల్లా బాలల పరిరక్షణ అధికారి కె.గణేష్,జిల్లా కోఆర్డినేటర్ (చైల్డ్ లైన్) బి.మహేశ్, జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది ఉన్నారు.

**అక్రమ దత్తత తీసుకుంటే కఠిన చర్యలు**

అక్రమ దత్తత చట్టరీత్యా నేరమని అక్రమ దత్తత తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 27 నుండి మే 2 వరకు బాలల భద్రత రక్షణ మరియు మత్తు పదార్థాలకు నోచెప్పండి అనే అంశంపై వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు.సోమవారం మహిళా,శిశు,దివ్యాంగుల,వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చట్టబద్ధమైన దత్తతపై అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎవరైనా పిల్లలను దత్తత తీసుకోవలసి వస్తే తప్పనిసరిగా చట్టబద్ధంగా మాత్రమే దత్తత తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. అక్రమ దత్తత చట్టరీత్యా నేరమని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి,జిల్లా పరిషత్ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి,జిల్లా బాలల పరిరక్షణ అధికారి కె.గణేష్,జిల్లా కోఆర్డినేటర్ (చైల్డ్ లైన్) బి. మహేశ్, చారుమతి చైల్డ్ కేర్ సంస్థ నిర్వాహకులు నాగసేనా రెడ్డి,జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది,చైల్డ్ లైన్ సిబ్బంది, బాలసదనం, శిశుగృహ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రతీ ఒక్క అధికారికి సమాచార హక్కు చట్టంపై అవగాహన

### రాష్ట్ర చీఫ్ సమాచార కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సమాచార హక్కు చట్టం దాని అమలుపై ప్రతీ ఒక్క అధికారికి అవగాహన ఉండాలని రాష్ట్ర చీఫ్ సమాచార కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పివి శ్రీనివాసరావు, మోహ్సినా పర్వీన్, దేశాల భూపాల్‌లు తెలిపారు. సోమవారం వారు జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లాలోని పిఐఓస్, ఏపిఐఓస్, సంబంధిత అన్ని విభాగాల అధికారులతో కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టం అమలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాచార హక్కు ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. పౌరులు సమాచార హక్కు చట్టం ద్వారా అడిగే న్యాయపరమైన ప్రశ్నలకు అధికారులు చట్టం నిబంధనల మేరకు వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్‌పి కె. నరసింహ, అదనపు కలెక్టర్ కె. సీతారామారావు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల చట్టపర పరిష్కారానికి తక్షణ కృషి

### సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె.నర్సింహా

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తక్షణ అదేశాలు, సూచనలు చేసి సమస్యల పరిష్కారానికి అవసరమైన దిశానిర్దేశం చేస్తున్నట్లు జిల్లా ఎస్‌పి కె.నర్సింహా అన్నారు. సోమవారం పోలీస్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఫిర్యాదుదారులతో మాట్లాడారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారులనుండి ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ ప్రజల సమస్యలపై త్వరితగిన చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితులకు బరోసా కల్పించాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న ప్రజలు పైరవీలు లేకుండా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, శాంతిభద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండటమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమన్నారు.



# ఒంటెద్దు నరసింహారెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలి

### ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** బిఆర్ఎస్ పార్టీ నాయకుడు ఒంటెద్దు నరసింహారెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వర్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాదితో కలిసి ఆయన మాట్లాడారు. అనంతారం గ్రామం నుండి హుజూర్‌నగర్‌కు వలసపోయిన ఒంటెద్దు నరసింహారెడ్డి అవినీతి పరుడు, ఒక కేడర్‌లేని నాయకుడన్నారు. గతంలో 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో కాంట్రాక్టుల పేరుతో పెద్దఎత్తున అవినీతికి పాల్పడిన వ్యక్తి అని విమర్శించారు. అటువంటి వ్యక్తి తన స్థాయిని మరచి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీద విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. హైదరాబాద్‌లో బిఆర్ఎస్ భవన్‌లో సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌పై చేసిన విమర్శలు వాపసు తీసుకొని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే కాంగ్రెస్ పార్టీ నాయకులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నరసింహారెడ్డిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని, రూ.50లక్షల నష్టపరిహారం చెల్లించాలని కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్‌నగర్, కోదాడ నియోజక వర్గాలలో పెద్దఎత్తున అభివృద్ధి చేస్తున్నారని, హుజూర్‌నగర్‌లో 2160 సింగిల్‌బెడ్ రూమ్ ఇండ్లు కట్టిస్తున్నారని, సూర్యాపేట జిల్లాలో మూడు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఒక్కొక్కటి రూ.200కోట్ల వ్యయంతో నిర్మాణం చేస్తున్నారని, అనేక లిఫ్ట్ ఇరిగేషన్ పనులు నిర్మాణం చేయిస్తున్నారన్నారు. అటువంటి వ్యక్తిపై అవినీతి పరుడంటూ విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఆయన స్వంత గ్రామమైన అనంతారంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ పదవిని కైవసం చేసుకొని భారీ విజయం సాధించామన్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు అంజద్‌అలీ, నాయకులు ఎలిమినేటి అభినయ్, కోతి గోపాల్‌రెడ్డి, ధరావత్ వీరన్న నాయక్, తూముల సురేష్ రావు, తంగెళ్ళ కరుణాకర్ రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



## ఘనంగా రామచందర్ రావు జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు జన్మదిన వేడుకలను సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కేక్ కట్ చేసి, మిఠాయిలను పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకల్లో రాష్ట్ర ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్, మాజీ శాసనసభ్యులు శానంపూడి సైదిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి తుటుపల్లి రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడియం రామచంద్రయ్య, బొబ్బ భాగ్యరెడ్డి, రంగినేని రుక్మారావు, బండారు కవిత, వంగవీటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## గోవును జాతీయ జంతువుగా గుర్తించాలి



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మండలంలోని రామాలయం శివాలయం ప్రాగణం గోపూజానిర్వహించిన బిజెపి తుంగతుర్తి అసంబ్లీ కోకన్వీనర్ కూరాకుల వెంకటేశ్వరావు, జిల్లా కౌన్సిల్ మెంబర్ కూరాకుల అరుణ అనంతరం నందీశ్వరుని వద్ద రాష్ట్రపతి, ప్రధాని, గవర్నర్, ముఖ్యమంత్రిలకు పంపె వినతిపత్రాలకు పూజలు నిర్వహించి నందినాయకత్వంలోని ర్యాలీని ముఖ్యాతిథి ఈశఫౌండేషన్ వాలంటీర్ శ్రవంతి జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమం గోసేవ అభియాన్ మండల బాధ్యులు తోట మురళి కూరాకుల వెంకటేశ్వర్లు, మండల బిజెపి అధ్యక్షులు ననుబోతు సైదులు, సీనియర్ నాయకులు శ్యాం సుందర్‌రెడ్డి మండల పార్టీ ప్రధానకార్యదర్శులు నవీన్, నర్సింహా, ఉపాధ్యక్షులు నాగరాజు, సరస్వతి పాల్గొన్నారు.

## గో సంరక్షణ తమ ఊపిరి

**ప్రజాపక్షం/ రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల పరిధిలోని మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలో గల జగద్గురు శ్రీ ఆది శంకర గోశాల ఆధ్వర్యంలో గోవును జాతీయ గోమాతగా ప్రకటించాలని ఇంద్రపాలనగరం గ్రామం మరియు మండల కేంద్రంలో బైకులతో భారీ ర్యాలీ నిర్వహించి, మండల తహసిల్దార్ లాల్ బహదూర్ శాస్త్రి, పోలీసు శాఖ వారికి మరియు కలెక్టరేట్లో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నకిరేకంటి మొగులయ్య,మండల నరసింహ, కె.వెంకటేష్, రాహుల్, మండల కృష్ణ, పూస నవీన్, కాలేరు నాగరాజు, కైరంకొండ సంతోష్ కుమార్, కైరంకొండ రాజేష్ కుమార్, బోయిని శివకుమార్, గుర్రం లక్ష్మణ్ బాబు పాల్గొన్నారు.



# ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు ఇవ్వడమే లక్ష్యం



**ప్రజాపక్షం/చివ్వెంల :** ఇల్లు లేని నిజమైన నిరుపేదలకు ఇల్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. మండలంలోని మోదింపురం గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లను అధికారులు, గ్రామ సర్పంచ్ సగరపు సునీత ప్రసాద్‌లతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్న 9 ఏండ్ల కాలంలో ఏ ఒక్కరికి ఇల్లు ఇవ్వలేదని మండిపడ్డారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల జాబితాలో అనర్హులు కూడా ఉన్నారని వారిని గుర్తించి తొలగించాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు డబుల్ బెడ్ రూములు అసంపూర్తి నిర్మాణం కోసం ఎంత అయితే ఖర్చు చేశారో ఇప్పుడు అంత ఖర్చు కాంగ్రెస్ ప్రభుత్వం వెచ్చించి పూర్తి నిర్మాణం చేయవల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 50కు పైగా డబుల్ బెడ్ రూం ఇండ్లకు విద్యుత్ సౌకర్యం, మంచినీటి సౌకర్యం, డ్రైనేజీ, కట్టిన డబుల్ బెడ్ రూమ్‌లకు కిటికిలు, తలుపులు, మంచినీరు అందించేందుకు వాటర్ ట్యాంకు, సిసి రోడ్లు వేసి, మిగతా పనులు అన్ని చేయవల్సి ఉందన్నారు. డబుల్ బెడ్ రూమ్‌లలో ఉన్న అసౌకర్యాలను గుర్తించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించి నిరుపేదలకు ఇండ్లు ఇచ్చేందుకు జిల్లా మంత్రి సుముఖంగా ఉన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్, సూర్యాపేట మండల పార్టీ అధ్యక్షుడు కోతి గోపాల్‌రెడ్డి, నాయకులు చింతమళ్ల రమేష్, అబ్దుల్ రహీం, కొండపల్లి దిలీప్‌రెడ్డి, రాపర్తి భవాని శ్రీనివాస్ గౌడ్, ఎలిమినేటి అభినయ్ నాయుడు, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, నాగు నాయక్, పడిదల రవి పాల్గొన్నారు.

# మెయింటెనెన్స్ చార్జీలు భారంతో జెసిబి పనిరెట్లు పెంపు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** స్పేర్ పార్ట్స్, మెయింటినెన్స్ ఆయిల్ గ్రీజుల రేట్ల భారంతో జెసిబి పని రేట్లు పెంచుతున్నట్లు పోచంపల్లి మండల జెసిబి ఓనర్స్ అసోసియేషన్ సోమవారం జెసిబి లతో నిరసన వ్యక్తం చేస్తూ తెలిపారు. ఒక గంట జెసిపి పనికిగాను రూ 1500, జెసిబి లతో పనిచేసే అన్ని పనులకు గాను రేట్లవారీగా ఒక చార్ట్ ను రూపొందించి అసోసియేషన్ నిబంధనలు పాటించాలని తెలిపారు. సంఘం రూల్స్ పాటించకుండా తక్కువ రేట్లకు పని చేస్తే రూ.10 వేల జరిమానా విధించబడునని హెచ్చరించారు. ఎక్కువ తక్కువ రేట్లకు ఎవరూ కూడా పని చేయవద్దని పని చేయించుకునే యజమానులు మోసపోవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నోముల ప్రభాకర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు బసవ రెడ్డి, బొక్క మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షులు ధీరావత్ పరమేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి షేక్ జాన్ పాషా, కోశాధికారి మల్లెపల్లి నరేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పోతగల్ల రాజు, గోదాసు ప్రవీణ్, మల్లారెడ్డి, రఘుమారెడ్డి, దిలీప్ రెడ్డి, శివశంకర్, మహేందర్ యాదవ్, కుమార్, బన్నీ రెడ్డి, ధన రెడ్డి, బద్దం భాస్కర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఫర్టిలైజర్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఫర్టిలైజర్స్ డీలర్లు తాము ఎదుర్కొంటున సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర అసోసియేషన్ పిలుపుమేరకు సోమవారం తమ దుకాణాలను మూసి వేసి పట్టణంలోని వ్యవసాయాధికారి కార్యాలయం ఎదుట నిరసన నిర్వహించి అనంతరం ఇన్‌చార్జి ఏడీఏ రుషేంద్రమణికి వినతిపత్రం అందించి మాట్లాడారు. ఎరువుల ఉత్పత్తిదారులు సరఫరాపై రవాణా చార్జీలు వారే భరించి డీలర్స్‌పాయింట్‌కు ఎరువులను చేర్చాలని, కంపెనీ వారు అవసరమైన వారి ఉత్పత్తి కాని సరుకులను, ఎరువులను లింకుగా బలవంతంగా అంటగటొద్దని, ఎరువులపై అమ్మకాల్లో గత 15 నుంచి 20 సంవత్సరాల క్రితం ఉన్న డీలర్ల మార్జిన్‌ను పెంచాలని, గతంలో కంటే ప్రస్తుతం లారీ కిరాయిలు, హమాలీ చార్జిలు ఎన్నో రెట్లు పెరిగి వ్యాపారం అగమ్యగోచరంగా మారిందన్నారు. సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో పట్టణ గౌరవ అధ్యక్షుడు ముక్కా రామ్మూర్తి, అధ్యక్షుడు తెడ్ల జవహర్‌బాబు, ఉపాధ్యక్షుడు నామిరెడ్డి అశోక్‌రెడ్డి, గంగవరపు హరిబాబు, ఏచూరి శ్రీనివాస్, ఆలంపల్లి సంతోష్, జయిని అఖిల్, సోము బ్రహ్మానందం, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అవగాహన




**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** రైతు వేదికలో సోమవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు రైతు అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలచే పలు అంశాల పై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. తక్కువ యూరియా వాడకం గురించి, సమతుల్య ఎరువుల వినియోగం,మైక్రో న్యూట్రియంట్స్ ప్రాముఖ్యత, సేంద్రియ పద్ధతులు, ఆధునిక సాగు విధానాలుగురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డా.ఎం.వి.నాగేశ్ కుమార్, డైరెక్టర్ (సీడ్స్), డా.డి.శ్రీలత ప్రిన్సిపల్ సైంటిస్ట్ & కోఆర్డినేటర్, కేంద్రం (కెవికె), యాదాద్రి భువనగిరి, డా.ఎన్.ప్రవీణ్ ప్రొఫెసర్, సైంటిస్ట్ డా. కె. లక్ష్మీ ప్రసన్న, సైంటిస్ట్ శ్రీనివాస్, ఎడిఏ ఆలేరు పాండురంగాచారి, ఏఓ అడ్డగూడూరు, కవిత హెచ్ఓ, డా.అనిల్ రెడ్డి, వెటర్నరీ డాక్టర్ కె.నవనీత ఎఈఓ మమత, ఎహ్ఓ తదితరులు పాల్గొన్నారు.



## వేసవి శిక్షణను క్రీడాకారులు సద్వినియోగం

**ప్రజాపక్షం/నడిగూడెం:** గ్రామీణ క్రీడాకారులను గుర్తించేందుకు శిక్షణలు దోహదపడతాయని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ ఏపూరి తిరపతమ్మ సుధీర్, నడిగూడెం సర్పంచ్ దున్న శ్రీనివాస్ లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కొల్లు పాపయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా యువజన క్రీడల సమాఖ్య సూర్యాపేట ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి ఉచిత కబడ్డీ శిక్షణను సర్పంచ్ దున్నశ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడా నిర్వహకుడు పిడి నాగేశ్వరరావు, పలువురు వక్తలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎలుగూరి నాగరాజు, కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ చెనగాని కరుణాకర్, గుండు శ్రీను, కాసాని శివకృష్ణ, ఉపాధ్యాయులు మీరాజుద్దీన్, ఇంతియాజ్, చింతల రమేష్ పాల్గొన్నారు.

## బిసిలకు ప్రాధాన్యత కల్పించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వం త్వరలో భర్తీ చేసే నామినేటెడ్ పదవుల్లో బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. సోమవారం లింగంగౌడ్ హైద్రాబాద్‌లో జానారెడ్డి నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిలాలలో బీసీలకు రాజకీయంగా ఏ మాత్రం ప్రాధాన్యత, పదవులు లేవని, అన్ని పదవులు కూడా ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు అనుభవిస్తున్నారని అన్నారు. బీసీలు కేవలం ఓట్లు వేసే యంత్రాలుగానే ఉంటున్నారని అన్నారు. పేరుకే సామాజిక న్యాయం అని చెప్తూ పదవులు మాత్రం ఒకే సామాజిక వర్గానికి ఇస్తున్నారన్నారు. జానారెడ్డి స్పందిస్తూ ఖచ్చితంగా ఉమ్మడి జిల్లా బీసీలకు నామినేటెడ్ కార్పొరేషన్, డైరెక్టర్ పదవుల్లో తగిన ప్రాధాన్యత కల్పిస్తామని హామి ఇచ్చారని లింగంగౌడ్ అన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయాలి

**ప్రజాపక్షం/ రామన్నపేట :** తుమ్మలగూడెం దాన్యం కొనుగోలు కేంద్రంలో కాంటాలను ప్రారంభించి కొనుగోలు చేయాలని, వెంటనే రైస్ మిల్లు అలాట్మెంట్ చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య ప్రభుత్వ యంత్రాంగన్ని డిమాండ్ చేశారు. స్థానిక విద్యుత్ కార్యాలయం ముందు పోసిన 74 దాన్యం కుప్పలను పరిశీలన చేసి అనంతరం మాట్లాడుతూ గ్రామంలో రైతులు పోసిన దాన్యం రాసులకు కాంటా పెట్టకపోవడంతో రైతులు ఆవేదనకు గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, రైతు సంఘం మండల కార్యదర్శి గన్నెబోయిన విజయభాస్కర్ పాల్గొన్నారు.

## బంకుల వద్ద బారులు



**ప్రజాపక్షం/నందికొండ:** నందికొండ మున్సిపాలిటీ పరిధిలో పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రరూపం దాల్చింది.ఇంధనం కోసం పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు గంటల తరబడి బారులు తీరి ఎదురుచూస్తున్నారు.ప్రత్యేకించి డీజిల్ లభ్యత లేకపోవడంతో రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. బంకులకు చేరుకున్న వాహనదారులు ఇంధనం అందుతుందేమోనని నిరీక్షిస్తున్నారు.

**ప్రజాపక్షం/వేములపల్లి:** మండల కేంద్రంలో పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రరూపం దాల్చింది. ప్రతినిత్యం వాహనాలపై ఆధారపడే ప్రజలు ఇంధనం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.సోమవారం ఉదయం 10 గంటల నుంచి పెట్రోల్ కొరత ఏర్పడటంతో ద్విచక్ర వాహనదారులతో పాటు నిత్యావసర సరుకులను రవాణా చేసే భారీ వాహనాలు కూడా బంకుల వద్ద నిలిచిపోయాయి.ఇది నిజంగా ఇంధన కొరతా? లేక ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని ధరలు పెంచే ప్రయత్నమా? అని పలువురు వాహనదారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



## చలివేంద్రం ఏర్పాటు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** వేసవి తీవ్రత దృష్ట్యా పాదచారుల దాహార్తిని తీర్చేందుకు జగిని టెక్స్‌టైల్స్,జగిని దంత వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలోపట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ చలివేంద్రాన్ని సోమవారం వన్‌టౌన్ సీఐ వి. రాజశేఖర్ రెడ్డి తో కలసి డిఎస్‌పి కె. శివరామ్ రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిరంతరాయంగా చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వన్‌టౌన్ సీఐ వి. రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వేసవిలో పాదచారులకు దాహం తీర్చేందుకు చలివేందర్రం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ గోపాల్‌రావు,ఎస్‌ఐలు సైదులు,వెంకట నారాయణ,యాదగిరి రెడ్డి తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలపై వేధింపులు జరిగితే ఫిర్యాదు చేయాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మహిళలపై వేధింపులు జరిగినా, ఎలాంటి అకృత్యాలు జరిగినా వాటిని ఉపేక్షించకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని జిల్లా పోలీసు మహిళా భరోసా సెంటర్ సిబ్బంది సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ఐదవ అంశంలో మహిళలు, పిల్లల భద్రత, మాదక ద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి, వివాహ, షీ నీడ్స్ షాపింగ్ మాల్స్ నందు మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, విద్యార్థులు పిల్లల భద్రతలో చట్టాలు బలోపేతం చేయబడ్డాయని గుర్తు చేశారు. పిల్లలకు మంచి స్పర్శ, చెడు స్పర్శ, ఎవరేది ఇచ్చిన తీసుకోవద్దని చెప్పాలని చెప్పడం జరిగింది. అలాగే లింగ సమానత్వం గురించి వివరించారు. ప్రస్తుత సమాజంలో యువత మాదకద్రవ్యాల బారిన పడి వారి ఆరోగ్యాలను భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తల్లిదండ్రులు పిల్లల నడపడిక పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. ఏమైనా తప్పుడు మార్గంలో వెళ్లినట్లయితే వారిని గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పవిత, జ్యోతి, కిరణ్మై, వనజ, శృతి, ప్రమీల పాల్గొన్నారు.

## కామ్రేడ్ వీసాల గోవింద్‌కు విప్లవ జోహార్లు

**ప్రజాపక్షం/కోదాడ:** కామ్రేడ్ వీసాల గోవింద్ 14వ వర్ధంతిని సోమవారం కోదాడలోని లాల్ బంగ్లాలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రిసి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి ఉదయగిరి మ మాట్లాడుతూ అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షులు వీసాల గోవింద్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి వి.నర్సింహరావు, రైతుకూలి సంఘం నాయకులు సత్యనారాయణరెడ్డి, విజయ్, వీరబాబు, కొండయ్య, రవిజేత, నర్సింహరావు, సైదులు, ఖాసీం పాల్గొన్నారు.

## కరాటే గిన్నిస్ వరల్డ్ రికార్డ్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :**జయంత్ రెడ్డి ఇంటర్నేషనల్ తైక్వాండో అకాడమీ , విజన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 26న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ స్థాయి భారీ సామూహిక కరాటే ప్రదర్శన అంగరంగ వైభవంగా జరిగింది.ఈప్రదర్శన ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో సరికొత్త అధ్యాయం లిఖితమైంది.తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల నుంచి వందలాది కరాటే క్రీడాకారులు ఈఅరుదైన ప్రదర్శనలో పాల్గొన్నారు. గతంలో 8 నిమిషాల పాటు సాగిన సామూహిక కరాటే ప్రదర్శన గిన్నిస్ రికార్డుగా ఉండగా, తాజాగా క్రీడాకారులు 11నిమిషాల పాటు ఏకధాటిగా పంచ్‌లు,బ్లాక్‌లతో ఉత్కంఠభరిత ప్రదర్శన ఇచ్చి పాత రికార్డును బద్దలు కొట్టారు.ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో నల్లగొండ పట్టణానికి చెందిన షావోలిన్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియా ఫౌండర్ డైరెక్టర్ నాంపల్లి కనకారావు,బ్లాక్ బెల్ట్ 1వ డాన్ కట్ట అయోధ్య రాములు పాల్గొని తమ ప్రతిభను చాటారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన నాంపల్లి కనకారావు,కట్ట అయోధ్య రాములును షావోలిన్ షోటోఖాన్ జనరల్ సెక్రెటరీ సింధు లవ కుమార్,గుర్రంపోడు మాజీ జడ్‌పిటీసీ గాలి సరిత రవికుమార్ గౌడ్, సర్పంచ్ జాలా యాదయ్య,కట్టవారిగూడెం సర్పంచ్ చాడా ప్రమీల చక్రవర్తి,ఉపసర్పంచ్ మేకల కోటిరెడ్డి, ఉపసర్పంచ్ పర్సనబోయిన రాధా వెంకన్న,షావోలిన్ షోటోఖాన్ విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు.

## నెల్లిబండ జాతరకు వేముల వీరేశంకు ఆహ్వానం



**ప్రజాపక్షం/నకిరేకల్:** మండలంలోని నెల్లిబండ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ లింగమంతుల స్వామివారి జాతర ఉత్సవాలకు హాజరు కావాల్సిందిగా ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశంను ఆలయ పాలక మండలి సభ్యులు ఆహ్వానించారు.మే 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే జాతర ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆదివారం ఆయనకు అందజేశారు.ఈ సందర్భంగా జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

**నేషనల్ హ్యాండ్‌బాల్‌కు ఎంపికైన విద్యార్థినులకు అభినందనలు**

నేషనల్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన రాష్ట్ర విద్యార్థినులను ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం అభినందించారు.దేశ స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా విద్యార్థినులకు క్రీడా జర్సీలు పంపిణీ చేసి, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారుఈకార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు చింతకాయల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మండలంలోనిగ్రామంలోని శ్రీ విజయ కనకదుర్గాదేవి ఆలయ తొలి వార్షికోత్సవంలో ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్ ముసుకు స్టాలిన్ రెడ్డి,అధ్యక్షుడు కోమటిరెడ్డి కిరణ్,గ్రామస్తులు కుంచం సోమయ్య,బాధిని యాదయ్య,కొడదల లింగయ్య,ఆలగడప సైదులు, యల్మకంటి జానయ్య,కాంబ్లీ శ్రీధర్ పాల్గొన్నారు.

## మాతా శిశు మరణాలను తగ్గించే చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మాతా శిశు మరణాలను తగ్గించే చర్యలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వైద్యఆరోగ్య శాఖ సమావేశ మందిరంలో ఈనెల 27 నుండి మే 11 వరకు జరుగు ఆశా నోడల్ అధికారులు, ఆశాల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గర్భిణీల నమోదు, ఎఎన్‌సి చెకప్‌లు, సురక్షిత ప్రసవం, బాలింతల సంరక్షణ, శిశు టీకాలు, పోషకాహారం, బాలల వృద్ధి పర్యవేక్షణ వంటి అంశాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామస్థాయిలో అమలవుతున్న ఆరోగ్య సేవలను పర్యవేక్షించే విధానం, సమస్యలను తక్షణమే గుర్తించడం, పైస్థాయి అధికారులకు నివేదించాలన్నారు. గ్రామాలలో నిర్వహించే విహెచ్‌ఎన్‌డి కార్యక్రమాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు అందించాల్సిన ఆరోగ్య సేవలు, టీకాలు, పోషకాహార సలహాలు, ఆరోగ్య పరీక్షలు అవగాహన కార్యక్రమాల నిర్వహణపై ఆచరణాత్మకమైన మార్గదర్శకాలను తెలుసుకోవాలన్నారు. ప్రతి నెల నిర్వహణలో పాటించాల్సిన షెడ్యూల్, బాధ్యతల గురించి ఇట్టి శిక్షణలో వివరించబడుతుందన్నారు. ఈ శిక్షణ ద్వారా ఆశా కార్యకర్తల సామర్థ్యాలను పెంపొందించబడుతాయని చెప్పారు. ఎండల తీవ్రత వలన ఆరోగ్య సేవలను ఉదయం 11 గంటల వరకు పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన బాలికలకు హెచ్‌పివి వ్యాక్సిన్ 100 శాతం ఇప్పించాలని తెలిపారు. డ్రాప్‌ఔట్, లెఫ్ట్‌ఔట్, మిస్డ్ ఔట్ లేకుండా 05 సంవత్సరాల పిల్లలకు వ్యాక్సిన్ ఇప్పించి మరింత సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఓడిటిటి డాక్టర్ శ్రీశైలం, డిప్యూటి డెమో వి. సంజీవరెడ్డి, డిపిఓ ఉమామహేశ్వరి ఉపేందర్, శంకర్, ఆశా నోడల్ అధికారులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## స్వీయ నమోదు చేసుకున్నాం.. మీరు చేసుకోండి!

**ప్రజాపక్షం/నకిరేకల్:** జనగణన 2027లో భాగంగా స్వీయ నమోదు ప్రక్రియను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల వివరాలను యాప్ ద్వారా నమోదు చేశారు.జనగణనలో ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని,యాప్ ద్వారా స్వీయ నమోదు చేసుకోవాలని వీరేశం పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో ఆయన సతీమణి వేముల పుష్ప,నకిరేకల్ మున్సిపల్ కమిషనర్ రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంలో సానుకూల నిర్ణయాలు తీసుకుంటూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, ఉద్యోగులను ప్రభుత్వ సిబ్బందిగా గుర్తించడం,32 డిమాండ్ల అమలు,పీఆర్సీ అమలు,జీతాల పెంపుకు అంగీకరించడం పట్ల నకిరేకల్ ఆర్టీసీ కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో సోమవారం ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశంను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉద్యోగుల ఐక్యవేదిక నాయకులు ఎస్ఎస్ గౌడ్,పి నాగాచారి,మనన్,రాంబాబు,లచ్చయ్య,శ్రీనివాస్,ఏకాంబరం, పుల్లయ్య, వెంకటేశ్వర్లు, రమేష్, మంజుల పాల్గొన్నారు.

## టివిఎస్‌ను కారు ఢీకొట్టి పరారు.. ఇద్దరికి గాయాలు



**ప్రజాపక్షం/నకిరేకల్:** టీవీఎస్ లూనాను గుర్తు తెలియని కారు ఢీకొట్టి పరారైన ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు.ఈ ప్రమాదం సోమవారం కట్టంగూరు మండలం ఐటీపాముల శివారులో బొగ్గు సత్తిరెడ్డి కంపెనీ ఎదుట చోటుచేసుకుంది.నార్కెట్‌పల్లి మండలం శాపల్లి గ్రామానికి చెందిన ఆడెపు లింగయ్య (60),దాసరి లింగ(70) టీవీఎస్ లూనాపై నకిరేకల్ హాస్పిటల్‌కు వైపు వెళ్తుండగా వెనుకనుంచి వచ్చిన కారు ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది.దీంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోగా గాయాలయ్యాయి. వారిలో ఒకరికి కాలు విరిగినట్లు సమాచారం.స్థానికులు వెంటనే స్పందించి 108లో క్షతగాత్రులను నకిరేకల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను గుర్తించి బాధితులను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## శభాష్ బిడ్డా.. యజ్ఞశ్రీకి నాలుగు బ్యాంకు ఉద్యోగాలు



**ప్రజాపక్షం/నకిరేకల్ :**మండలంలోని పాలెం గ్రామానికి చెందిన పానుగంటి యజ్ఞశ్రీ అరుదైన ఘనత సాధించింది.కేంద్ర ప్రభుత్వ బ్యాంకుల్లో ఏకంగా నాలుగు ఉద్యోగాలకు ఎంపికై అందరి మన్ననలు పొందుతోంది.పాలెం గ్రామానికి చెందిన పానుగంటి బాలబ్రహ్మచారి,సూర్యకళ దంపతుల పెద్ద కుమార్తె యజ్ఞశ్రీ.ఉద్యోగరీత్యా కుటుంబం నల్లగొండ పట్టణంలోని నందీశ్వర కాలనీలో ఉంటోం ది. పదో తరగతి వరకు ఆల్ఫా, ఏకలవ్య స్కూళ్లలో,ఇంటర్ హైదరాబాద్ నారాయణ కళాశాలలో,బీటెక్ భోజిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో పూర్తిచేసింది.ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా హైదరాబాద్‌లోని సీజర్ సీసీఐ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటూ క్రమశిక్షణతో సిద్ధమైంది.ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఇండియన్ బ్యాంక్ పీఓ,తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పీఓ,ఎస్‌బీఐ క్లర్క్, కెనరా బ్యాంక్ క్లర్క్ పోస్టులకు ఒకేసారి ఎంపికైంది.క్రమం తప్పని చదువు, పట్టుదల,ఆత్మవిశ్వాసమే తన విజయానికి కారణమని యజ్ఞశ్రీ తెలిపింది.సరైన ప్రోత్సాహం ఉంటే అమ్మాయిలు ఏ రంగంలోనైనా రాణించగలరని నిరూపించిందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



## వ్యాసరచన పోటీలో ద్వితీయ స్థానం

**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ ప్రథమ సంవత్సరం చదువుతున్న వై.అక్షయ యు అండ్ మి సంస్థ రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ద్వితీయ స్థానం సాధించింది. నిన్న హైదరాబాదులో ఏర్పాటుచేసిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల విద్యా కమిషనర్ దేవసేన చేతుల మీదుగా బహుమతి స్వీకరించడం చాలా ఆనందించదగ్గ విషయమని కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం అన్నారు. రాష్ట్రస్థాయి పోటీలో విజేతగా రాణించి బహుమతి సాధించడం కళాశాలకు గర్వకారణమన్నారు. కళాశాల అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది అక్షయను అభినందించారు.

## పెట్రోల్, డీజిల్ కటకట మూతపడ్డ బంకులు

**ప్రజాపక్షం/రామన్నపేట** : పెట్రోల్, డీజిల్‌కు తీవ్ర కొరత ఏర్పడింది. రామన్నపేట మండలంలో గత 3 రోజులుగా మొదలైన ఈ కొరత సోమవారం నాటికి తీవ్రమైంది. ఇంధన కొరతతో రామన్నపేట మరియు చుట్టుపక్కల మండల ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడంతో చాలాచోట్ల బంకులు మూతపడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్టాక్ ఉన్న బంకుల వద్ద గంటల తరబడి క్యూలో నిలబడ్డ పరిస్థితి నెలకొంది. పనులు మానుకొని గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. పౌరసరఫరాల శాఖ ఈ పరిస్థితిపై దృష్టి సారించి పెట్రోల్ డీజిల్ కొరత తగ్గేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.

## నగర సంకీర్తన భజనలు



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : సోమవారం ఏకాదశి పర్వదినం సందర్భంగా తుర్కపల్లి మండల కేంద్రంలో భక్తులు నగర సంకీర్తన చేస్తూ భజనలు చేశారు. గ్రామంలోని శ్రీ సీతారామంజనేయ స్వామి దేవాలయం నుండి రామనామ కీర్తనలు, భజనలతో వీధుల్లో నగర సంకీర్తన చేపట్టారు. ప్రతి హైందవుడు నగర సంకీర్తన కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సంకీర్తనలో భక్తులు కాశాశికం జగదీష్, కందుకూరి అమర్‌నాథ్, మడిగె వెంకటస్వామి, సాయి, కందుకూరి వేణు, పద్మశాలి కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు.

## దేశ వికాసం కోసమే జనగణన

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** భారతదేశ అభివృద్ధికి, సంపూర్ణ వికాసానికి జనగణన వివరాలు చాల కీలకమని హుజూర్‌నగర్ మండల తహసీల్దార్ బండా కవిత అన్నారు. హుజూర్‌నగర్ రూరల్ మొదటి బ్యాచ్ జనగణన శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ప్రారంభించి ప్రసంగిస్తూ మండలంలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు ఎలాంటి తప్పులు లేకుండా ప్రజల నుంచి సరైన వివరాలు సేకరించి మొదటి విడత జనగణన విజయవంతం చేయాలని కోరారు. రిసోర్స్ పర్సన్ కెవి సత్యనారాయణ, అమీమ్, ప్రధానోపాధ్యాయులు దాడి నర్సిరెడ్డి, సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్లు, నరేష్ పాల్గొన్నారు.

## ఫార్మా రంగంలో ఆర్గానిక్ సింథసిస్ పాత్ర కీలకం




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : ప్రస్తుత ఆధునిక కాలంలో మానవాళి ఎదుర్కొంటున్న కొత్త రకమైన వ్యాధులకు తక్కువ ఖర్చుతో, సమర్థవంతమైన ఔషధాలను కనుగొనడంలో ' ఆర్గానిక్ సింథసిస్ ,గ్రీన్ కెమిస్ట్రీ' కీలక పాత్ర పోషిస్తున్నాయని ఐఐఎస్సీ బెంగళూరు ప్రొఫెసర్ ఎ.టి.బిజు పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా, భూదాన్ పోచంపల్లి మండలం, దేశ్ముఖిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో డిపార్ట్మెంట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో సోమవారం రెండ్రోజుల జాతీయ స్థాయి సదస్సు 'ఎక్స్ప్లోరింగ్ న్యూ డైమెన్షన్స్ ఇన్ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ యుటిలైజింగ్ ఆర్గానిక్ సింథసిస్' ప్రారంభమైంది. అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న ఈ సదస్సు ప్రారంభోత్సవానికి ప్రొఫెసర్ ఎ.టి. బిజు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. కాన్ఫరెన్స్ సావనీర్ను ఆవిష్కరించారు.అనంతరం 'అప్లికేషన్స్ ఆఫ్ ఆర్గానోక్యాటలిసిస్ యూజింగ్ ఎన్‌హెటెరోసైక్లిక్ కార్బీన్స్ అనే అంశంపై ఆయన ఉపన్యాసం ఇచ్చారు. కార్బీన్లను ఉపయోగించి సంక్లిష్టమైన అణువులను సులభంగా ఎలా నిర్మించవచ్చో విద్యార్థులకు చెప్పారు. నాలుగు రాష్ట్రాల విద్యార్థుల భాగస్వామ్యం సదస్సుకు తెలంగాణ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపక బృందం, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉర్దూ స్కూల్ భవనానికి పనులు చేపట్టాలని వినతి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్**: పట్టణంలోని మాన్యం చల్క ప్రాథమిక పాఠశాల(ఉర్దూ మీడియం)కు సొంత భవన నిర్మాణం కోసం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోటి రూపాయలు మంజూరు చేశారు. ఈనిధులను విడుదల చేసి పనులు వెంటనే ప్రారంభించాలని కోరుతూ మైనార్టీ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం గ్రీవెన్స్ డేలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే చాంద్ పాషా,జిల్లా అధ్యక్షుడు ఎంఏ. గఫూర్,ప్రధాన కార్యదర్శి ఎండీ షాహిన్ తయ్యబ్ తదితరులు కలెక్టర్‌ను కలిసి మంత్రి ఆదేశాల మేరకు నిధులు విడుదల చేసి నిర్మాణం చేపట్టాలని కోరారు.గత 65 ఏళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతున్న ఈ పాఠశాల మౌలిక సదుపాయాల లేమితో ఇబ్బందులు పడుతోంది.ఈవిషయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా,పట్టణంలో ప్రభుత్వ స్థలాన్ని కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి కోటి రూపాయలు మంజూరు చేశారు.అయితే ఇప్పటివరకు పరిపాలనా అనుమతులు రాలేదని తెలిపారు.దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్,సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రణాళిక అధికారిని ఆదేశించారు.

## గొలుసు కాలువ ద్వారా చెరువుల్లోకి సాగునీరు



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : మండలంలోని కొండాపురం గ్రామంలో ఉన్న చెరువులో నీళ్లు లేక భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, వెంటనే కొండపోచమ్మ ప్రాజెక్టు ద్వారా వచ్చే సాగునీటిని పిల్లకాలువల ద్వారా గ్రామ చెరువు నింపాలని సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొండపోచమ్మ సాగర్ నుండి వస్తున్న కాలువ కొండాపురం మీదుగా వాసాలమర్రి, మల్కాపూర్, ధర్మారం, గొల్లగూడెం, వైపు వెళ్తుందని, కొండాపురానికి తూము, పిల్ల కాలువ లేక పోవడంతో కొండాపురం గ్రామ రైతులు సాగునీరుకు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఈ సమస్యను పరిష్కరించి కొండాపురం, తిరుమలాపురం, వీరారెడ్డిపల్లి చెరువుల్లోకి గొలుసు కాలువల ద్వారా నీరు నింపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని స్థానిక సమస్యలైనా గ్రామాల్లో, మంచినీటి సమస్య, డ్రైనేజీ సమస్య, ఖరాబైన బీటీ రోడ్లను బాగుచేయాలని కోరారు. తుర్కపల్లి నుండి యాదగిరిగుట్ట వరకు ఉన్న డబుల్ లైన్ బీటీ రోడ్డును వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్, మండల కమిటీ సభ్యులు కొక్కొండ లింగయ్య, గడ్డమీద నరసింహ, తూటి వెంకటేశం, ఆవుల కలమ్మ, సిల్వర్ పెంటయ్య, కోట నాగరాజు, లక్ష్మీ నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉచిత ఆరోగ్య శిబిరం సద్వినియోగం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : నేతన్నకు ఆరోగ్య భద్రత ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా సోమవారం పోచంపల్లి పట్టణంలోని డై హౌస్‌లో చేనేత కార్మికులకు ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు కోరారు. ఏడి హ్యాండ్లూమ్స్ శ్రీనివాస్ రావు ప్రారంభించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. చౌటుప్పల్ డివిజన్ డిప్యూటీ డిస్ట్రిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యశోద పర్యవేక్షించారు. 70 మంది చేనేత కార్మికులు వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు మండల వైద్యాధికారిని డాక్టర్ శ్రీవాణి తెలిపారు. డాక్టర్ సోనీ జనరల్ ఫిజీషియన్, డాక్టర్ బాలాజీ ఆర్థోపెడిక్, డాక్టర్ నబీలా ఆప్తమాలజిస్ట్, సూపర్వైజర్ శ్రీదేవి, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మణ్ బాబు, భవాని, వాణి, లత, ఫార్మసిస్ట్ ప్రదీప్, ల్యాబ్ టెక్నీషియన్ పద్మ, టై అండ్ అసోసియేషన్ మేనేజర్ ఆంజనేయులు మరియు ఆశా కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## నందికొండ మున్సిపాలిటీలో ఏకగ్రీవంగా కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక

**ప్రజాపక్షం/నందికొండ:** నందికొండ మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో నలుగురు కోఆప్షన్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మున్సిపల్ చైర్‌పర్సన్ మానస స్వర్ణ అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో కోఆప్షన్ సభ్యుల ఎంపిక ప్రధాన అజెండాగా ఉంది.మొత్తం ఎనిమిది మంది దరఖాస్తు చేసుకోగా,కౌన్సిల్ సభ్యుల సమన్వయంతో నాలుగు విభాగాల్లో ఒక్కొక్కరిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ప్రత్యేక అనుభవం కలిగిన పురుషుల విభాగంలో తుమ్మలపల్లి కోటిరెడ్డి,స్త్రీల విభాగంలో నిమ్మల ఇందిర, అల్పసంఖ్యాక వర్గాల పురుషుల విభాగంలో మొహమ్మద్ ముజీబ్, అల్పసంఖ్యాక వర్గాలస్త్రీల విభాగంలో షైని మేలీన మల్ల ఎన్నికయ్యారు.ఎన్నికైన సభ్యులతో మున్సిపల్ కమిషనర్ ఏ.అశోక్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు.చేతులు ఎత్తే పద్ధతిలో పారదర్శకంగా ఎన్నిక నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.ఈ సమావేశంలో 3వ వార్డ్ బిఆర్ఎస్ కౌన్సిలర్ మినహా మిగిలిన అన్ని వార్డుల కౌన్సిలర్లు హాజరయ్యారు.అనంతరం నూతన కోఆప్షన్ సభ్యులను కౌన్సిల్ సభ్యులు శాలువాలతో సన్మానించారు.

## కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ నేతకు మద్దతుగా మూకుమ్మడి రాజీనామా



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : పోచంపల్లి పురపాలక కేంద్రంలోని ముక్తాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ యువ నాయకులు బందారు ప్రకాశ్ రెడ్డిని క్రమశిక్షణ రహితం కింద శనివారం సస్పెండ్ చేసిన దరిమిలా ముక్తాపూర్‌లో నిరసనగా ఆయనకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో పాటు 50 మందికి పైగా యువకులు కలిసి కట్టుగా రాజీనామా చేశారు. రెడ్డి సంఘం నాయకులు బందారు జంగారెడ్డి బాల్రెడ్డి, 2వ వార్డు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొండమడుగు శ్రీకాంత్, మండల యువ నాయకులు బందారు వినోద్ రెడ్డి, కొండమడుగు బాలకృష్ణ, బద్దం రాజు, వంటిది ఎల్లయ్య, 2వ వార్డు పోతగల్ల తరుణ్, ఉపాధ్యక్షులు కొండమడుగు చంద్రయ్య వంటి ముఖ్య నాయకులు రాజీనామా చేసిన వారిలో ఉన్నారు. పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసి కౌన్సిలర్ల గెలుపులో ముఖ్యపాత్ర వహించిన ప్రకాష్ రెడ్డిని పార్టీ నుండి తొలగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. మీ వెంటే మేము అంటూ మరిన్ని రాజీనామాలు ఉంటాయని తెలిపారు.

## ఫార్మా సంకల్ప్ జాతీయ సదస్సు

**ప్రజాపక్షం/భువనగిరి** : యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరి పరిధిలోని యూనిటీ ఫార్మసీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ అంపటి శ్రీనివాస్ అధ్యక్షతన ఫార్మా సంకల్ప్ పురస్కరించుకొని సోమవారం ఘనంగా జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నేషనల్ ఫార్మసిటికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ టీవి నారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఫార్మా రంగాన్ని ఎంతో అభివృద్ధితో ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ఫార్మసీ చదువుకునే విద్యార్థులు తమ రంగంలో నైపుణ్యతను పెంచుకొని అత్యున్నత స్థానాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమానికి నేషనల్ ఫార్మసిటికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ టీ వి నారాయణ, యూనిటీ గ్రూప్ ఆఫ్ కాలేజెస్ చైర్మన్ ఏ ప్రభాకర్ రెడ్డి, వివిధ కళాశాల చైర్మన్లు, ప్రిన్సిపల్స్, డైరెక్టర్లు, కళాశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** అర్హులైన ప్రతి ఒక్కరు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని గారకుంట తండా సర్పంచ్ బాణోతు అరుణ రమేష్ నాయక్ కోరారు. సోమవారం మండలంలోని గారకుంటతండా గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు ఉదయం ఆరు గంటలకు వచ్చి పది గంటలలోపు పనులు ముగించుకోవాలని సూచించారు. పనులు జరిగే ప్రదేశంలో ఉపాధి కూలీలకు నీడ కోసం టెంట్, తాగునీరు, మెడికల్ కిట్టు లాంటి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గౌతమి సుధాకర్, గరిడేపల్లి మాజీ సర్పంచ్ సైదానాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# రసాయన ఎరువులతో తగ్గుతున్న భూసారం

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** పంట పొలాల్లో రైతాంగం మోతాదుకు మించి రసాయనక ఎరువులను, యూరియాను వాడటంతో భూసారం గణనీయంగా తగ్గిపోతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సుకుమార్, డాక్టర్ శ్రీనివాసరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిధిలోని పొనుగోడు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. తెలంగాణ వ్యవసాయ శాఖ, వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. రైతాంగం మోతాదుకు మించి విరివిగా రసాయన మందులు పిచికారి చేయడంతో భూమి ఆరోగ్యం దెబ్బ తింటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇవో మనోజ్, గ్రామ సర్పంచ్ కటికం వేణు, రైతులు కటికం రమేష్, కటికం గోపయ్య, సుందరి నాగేంద్ర బాబు, దేవిరెడ్డి లింగయ్య పాల్గొన్నారు.

# చేనేత డైరీ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** తెలంగాణ చేనేత డైరీని చేనేత జౌళి శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ సోమవారం హైదరాబాద్ చేనేత కమిషనర్ ఆఫీసులో జరిగిన ఒక సమావేశంలో విడుదల చేశారు. సంఘమిత్ర పబ్లికేషన్ ఎడిటర్ తడక యాదగిరి రూపొందించి ప్రచురించిన డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత గజం అంజయ్య, వీవర్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ అరుణ్ కుమార్, హెచ్‌కె చారి, చేనేత నాయకులు భారత లవ కుమార్, జేడీలు వెంకటేశ్వర రావు, ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ క్యాన్లు పంపిణీ

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఉపాధిహామీ పనికి వెళ్లే కార్మికులకు ఎండలు తీవ్రంగా ఉండడంతో, వారి దాహార్తిని తీర్చి,శక్తిని అందించడానికి వాటర్ క్యాన్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శివరాత్రి లావణ్య జహంగీర్, ఉప సర్పంచ్ గోనె జహంగీర్, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్, పీల్డ్ అసిస్టెంట్, గ్రామ వార్డు సభ్యులు బండారి స్వప్న పాల్గొన్నారు.



# సామాజిక ఆర్‌టిఐ కార్యకర్తలను ప్రభుత్వ పరంగా గుర్తించి ప్రశంసా పత్రాలు అందించాలి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** సూర్యాపేట జిల్లాకలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు ప్రధాన కమిషనర్ జి. చంద్రశేఖర్‌రెడ్డి, కమిషనర్లు పివి శ్రీనివాసరావు, మోహసిన పర్వీన్, భూపాల్, బోరెడ్డి అయోధ్యరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె.నర్సింహా, సూర్యాపేట జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల హెచ్‌వోడిల తోటి పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ల తోటి తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ సోమవారం ఏర్పాటు చేసిన ఆర్‌టిఐ అవెర్నెస్ ప్రొగ్రాంలో షేక్ మన్సూర్‌అలీ పాల్గొని ప్రసంగించారు. సమాచార హక్కు చట్టం 2005 జిల్లాలో పూర్తిస్థాయిలో సక్రమంగా అమలు జరిగేలా చూడాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఉందని అన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా కోరే సమాచారాన్ని సకాలంలో అందించాలని కోరారు. ఆర్‌టిఐ చట్టాన్ని అన్ని వర్గాల, అన్ని రంగాల మారుమూల గ్రామీణ పల్లెలు, తండాల ప్రజలు ఉపయోగించుకునేలా న్యాయం పొందేలా విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 15, జనవరి 26 తేదీలలో జిల్లా వ్యాప్తంగా సీనియర్ ఆర్‌ఐటి యాక్టివిస్టులను ఎంపిక చేసి జిల్లా కలెక్టర్‌తో సన్మానించి ప్రశంసా పత్రాలు అందరికి తెలిసే విధంగా అందరూ ఉపయోగించుకునే విధంగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిర్మూలన, విద్యార్థుల భద్రతపై జిల్లా షీటీమ్ అవగాహన



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్‌పి కె.నర్సింహా అదేశాల మేరకు సోమవారం జిల్లా షీటీమ్ బృందం జిల్లా కేంద్రంలో ప్రతిభ జూనియర్ కళాశాల, లక్ష్మి పారామెడికల్ కళాశాల, అంగన్‌వాడీ సెంటర్స్ నందు విద్యార్థులకు, పిల్లలకు, మహిళలకు వివిధ అంశాల పట్ల అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీమ్ బృందం మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సాంకేతికత అభివృద్ధి చెందిన కొత్త తరహాలో మోసాలు జరుగుతున్నాయని విద్యార్థులు వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారీన పడి బంగారు భవిష్యత్‌ను కోల్పోతున్నారని, డ్రగ్స్ నిర్మూలించడంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. మహిళలు వేదింపులకు గురైతే వెంటనే 100కు సమాచారం ఇవ్వాలని, పిల్లల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించిన హింసకు గురిచేసిన 1098కి సమాచారం ఇవ్వాలని కోరారు.

# చెరువు అలుగు ధ్వంసంపై కేసు నమోదు



**ప్రజాపక్షం/నిడమనూరు:** మండల పరిధి ఊట్కూర్ వద్ద చేపల కోసం చెరువు అలుగును ధ్వంసం చేసిన ఘటనపై చెరువు కాంట్రాక్టర్ పై కేసు నమోదు చేసినట్లు నిడమనూరు ఎస్సై ఉప్పు సురేష్ తెలిపారు, ఊట్కూర్ సర్పంచ్ కురువేటి వసుమతి నరసింహ,నందికొండ వారి గూడెం సర్పంచ్ తెరపాటి శంకర్,మాజీ సర్పంచ్ కొండ జానయ్య,మాజీ ఎంపిటిసి కేశ బోయిన జానయ్య ఆయా గ్రామాలకు చెందిన పెద్దలు యువకులు సోమవారం సంబంధిత ఐబి డిఈఈ శ్రీనివాసు ను కలిసి చేపలు పట్టేందుకు చెరువు కాంట్రాక్టర్ పటిష్టంగా ఉన్న చెరువు అలుగును ధ్వంసం చేసి నీటిని వదలడానికి సంబంధించి ఆందోళన వ్యక్తం చేశారు,చుట్టూ 10 గ్రామాల రైతులకు తాగు సాగు నీటిని భూగర్భ జలాలను అందించే చెరువు కు కాంట్రాక్టర్ రూపంలో పొంచి ఉన్న ప్రమాదంపై ఆవేదన వ్యక్తం చేశారు,ఘటనపై స్పందించిన డిఈ రైతులకు సర్ది చెప్పి చాపల చెరువు కాంట్రాక్టర్ పై నిడమనూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు డిఈఈ శ్రీనివాస్ తెలిపారు.ఈ విషయంపై ఎస్సై వివరణ కోరగా చెరువు అలుగు ధ్వంసం విషయమై సంబంధిత అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు, కాగా చేపల చెరువు కాంట్రాక్టర్‌పై ఏ పాటి చర్యలు ఉంటాయో చూద్దాం అంటూ రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# పందెం కోడి పిల్ల బోరిగలో నూరు గ్రాముల వ్యర్థాలు

**ప్రజాపక్షం/కోదాడ:** గతంలో కోడి అన్న వాహికలో అరగని ప్లాస్టిక్ కవర్లు, మాంసం ముక్కలు, టమాటో ముక్కలు, ఉల్లి, ఎల్లిగడ్డలు గుర్తించడం జరిగిందని, ఈ సారి తాజాగా పందెం కోడి పిల్లకు తల్లి లేకుంటే కంటికి కనిపించిందే మేతగా భావించి చెక్క ముక్కలు, కర్ర పుల్లలు, ఎండిన గడ్డి తిని అవి అరగక ప్రాణాల మీదకు తెచ్చుకున్నాయి. మూడు మాసాల పందెం కోడి పిల్లలు. వివరాల్లోకి వెళితే కోదాడ పట్టణంలోని కర్రపని చేసే యాజమాని ప్రేమతో తల్లిలేని పెందెం కోడి పిల్లలను సాకుతున్నారు. మూడునెలల వయసున్న కోడి పిల్లల అన్న వాహిక ఉబ్బి వారం రోజులుగా మేత మేయకుండా డీలా పడిపోవడంతో చికిత్స కోసం ప్రాంతీయ పశువైద్యశాలకు తీసుకవచ్చారు. రాయిలాగా గట్టిగా బిగదీసుకున్న కోడి పిల్ల బోరిగను పరీక్షించిన అసిస్టెంట్ డైరెక్టర్ డాక్ట్ పెంటయ్య కోడి పిల్ల తినకూడని అరగని పదార్ధం ఎదో తిన్నట్లు గుర్తించి అన్న వాహికకు అత్యవసర



శస్త్ర చికిత్స నిర్వహించారు. అన్నవాహిక తెరిచి చూడగా ఆశ్చర్యంగా కర్ర పనిలో వచ్చే వృధా కర్ర ముక్కలు, కొబ్బరి పీచు, పురికోస దారాలు, చెక్క పుల్లలు, ముద్ద కట్టి ఉన్నాయి, అరకిలో కూడా లేని కోడిపిల్ల అన్న వాహికలో చిక్కుకున్న వంద గ్రాముల వ్యర్థాలను తొలగించాక కోడిపిల్ల తేలికగా శ్వాస తీసుకోవడంతో యాజమాని ఊపిరి పీల్చుకున్నాడు.



# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు

**ప్రజాపక్షం/చివ్వేంల:** ఇండ్లులేని ప్రతి నిరుపేదకు పక్కా ఇండ్లు కట్టించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికి దశల వారిగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మోదింపురం గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు ధారావత్ వీరన్ననాయక్ కలిసి లబ్ధిదారులు పులుగుజ్జు రేణుక ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ సగరపు సునిత ప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధారావత్ వీరన్ననాయక్, నాయకులు కోతి గోపాల్‌రెడ్డి, చింతమళ్ల రమేష్, కొండపల్లి దిలీప్‌రెడ్డిపాల్గొన్నారు.

# ఎంజియులో డిజిటల్ లైబ్రరీ ప్రారంభం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులకు ప్రపంచ స్థాయి సమాచారం, పరిశోధనా గ్రంథాలు డిజిటల్ లైబ్రరీ ద్వారా అందుబాటులోకి వస్తాయని ఎంజీయూ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు.సోమవారం వర్సిటీ ప్రధాన గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ గ్రంథాలయ పనివేళల్లో డిజిటల్ లైబ్రరీ సైతం విద్యార్థులకు అందుబాటులో ఉంటుందని, విద్యార్థులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి,ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఆచార్య ఆకుల రవి,కె.ప్రేమ్‌సాగర్,ఇంజనీర్ శైలజ,లైబ్రేరియన్ బుచ్చిరాములు తదితర అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంజీయూకు వారణాసి భవాని పేరిట స్వర్ణ పతకం

ఎంజీయూలో ఎమ్మెస్సీ జువాలజీ విభాగంలో టాపర్‌గా నిలిచే విద్యార్థినికి ప్రదానం చేసేందుకు రిటైర్డ్ హెచ్‌ఎం వారణాసి భవాని జ్ఞాపకార్థం స్వర్ణ పతకాన్ని ఏర్పాటు చేశారు.ఇందుకోసం ఆమె కుటుంబ సభ్యులు బి.వీరభద్ర ప్రసాద్ సోమవారం వర్సిటీ రిజిస్ట్రార్‌కు రూ.3 లక్షల చెక్కును అందజేశారు.వారణాసి భవాని జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఈస్వర్ణ పతకం ప్రతిభావంతులైన విద్యార్థినులకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.

# పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో...

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు.సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డేలో జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలపై ఫిర్యాదు చేశారు.మొత్తం దాదాపు 40 మంది బాధితులు ఎస్‌పిని ప్రత్యక్షంగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన ప్రతి ఒక్క బాధితుడి సమస్యను స్వయంగా విని,వాటి పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.



# మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మహిళా సాధికారతను మరింత బలోపేతం చేస్తూ మహిళలను ఆర్థికంగా బలమైన స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో మహిళా సంఘాలకు పెట్రోల్ పంపుల ఏర్పాటుపై సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లా కేంద్రంలోని ఎస్ఎల్‌బిసి పెట్రోల్ బంక్ పరిసర ప్రాంతంలో మెడికల్ కాలేజీ,నర్సింగ్ కాలేజీ,మైనారిటీ కాలేజీ, యంగ్ ఇండియా స్కూల్ వంటి విద్యాసంస్థలు ఉండటంతో భవిష్యత్తులో ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ తెలిపారు. అందువల్ల అదే ప్రాంగణంలో మార్కెట్, మినీ సూపర్ మార్కెట్, కాఫీ షాప్, స్టేషనరీ దుకాణాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.పెట్రోల్ బంక్ నిర్వహణకు సుమారు 18 మంది సిబ్బంది అవసరమని,వారికి తగిన శిక్షణ ఇచ్చి జిల్లా సమాఖ్య ద్వారా మహిళలను నియమించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి,జిల్లా మహిళా సమైక్య మేనేజర్ అనిత,డీపీఎం వీరయ్య,ఏపీఎం శ్రవణ్ కుమార్,జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు మాధవి,కార్యదర్శి సరిత,కోశాధికారి సునీత పాల్గొన్నారు.

**ఫార్మర్ రిజిస్ట్రీని వేగవంతంగా పూర్తి చేయాలి: కలెక్టర్ చంద్రశేఖర్**

ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ నుంచి మండల స్థాయి వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు పెద్ద సంఖ్యలో వస్తున్నందున,అక్కడికే వెళ్లి రైతులతో మాట్లాడి వెంటనే ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి నమోదు చేయించాలని,పట్టణ ప్రాంతాల్లో రైతులకు అవగాహన కల్పించి నమోదు ప్రక్రియ చేపట్టాలని అన్నారు. ముఖ్యంగా ఆధార్‌కు మొబైల్ నంబర్ లింక్ లేకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని,అలాంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధి,పంటల బీమా,రుణాలు,సబ్సిడీలు త్వరగా పొందే అవకాశం ఉంటుంది. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శ్రవణ్ కుమార్,ఏడిఏలు,ఏవోలు,ఏఈఓలు పాల్గొన్నారు.




## బాధ్యతగా పనిచేయాలి


**ప్రజాపక్షం/హాలియా:** అంగన్వాడీ టీచర్లు వృత్తి పట్ల నిబద్ధతతో వ్యవహరిస్తూ అంగన్వాడీలను మరింత బలోపేతం చేయాలని మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అన్నారు.హాలియా ప్రాజెక్టు పరిధిలో కొంతమంది అంగన్వాడీ టీచర్లకు 4జి స్మార్ట్ ఫోన్ల ను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై అంగన్వాడి కేంద్రాలలోకి వచ్చేటువంటి విద్యార్థుల హాజరు నమోదును ఈ ఫోన్లో నమోదు చేయాలని తెలిపారు.4జీ స్మార్ట్ ఫోన్లు అంగన్వాడీ టీచర్లకు అందుబాటులోకి రావడం వలన పని వారం కూడా తగ్గుతుందని సమాచారం మరింత అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో సిడిపిఓ విజయలక్ష్మి,సూపర్వైజర్ రమాదేవి,మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్,కౌన్సిలర్లు దేపావత్ ప్రసాద్ నాయక్,కొమ్మన బోయిన చంద్రశేఖర్, పిల్లి ఆంజనేయులు,ఎడవల్లి విజయ్, సైదులు, పాల్గొన్నారు.

## హిందువులంతా ఐక్య మత్యంగా మెలగాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** హిందువులంతా ఐక్య మత్యంగా మెలగాలని శ్రీ విశోక తీర్థ స్వామి సూచించారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో హిందు సమ్మేళనంను నిర్వహించారు. ఈ సమ్మేళనంలో విశోక తీర్థ స్వామి మాట్లాడుతూ హిందువులపై అన్యమతస్థులు అనేక కుట్రలు చేస్తున్నారని వాటిని తిప్పి కొట్టాలని అన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి, గంట తిరుమల్, ఇటకాల సిందూర, రమావత్ నాగేశ్వర్‌రావు, చిత్తరం జన్‌రెడ్డి, హిందూ సమ్మేళన సమితి అధ్యక్షుడు ఏరుకొండ రాము, బొడిగ సాంబశివగౌడ్, నీల విజయ్, జాగటి ముత్యం, భరత్, నరేందర్, వింజమూరి చంద్రమౌళి పాల్గొన్నారు.



# సీనియర్ జర్నలిస్ట్ మధుసూదన్ మృతికి పలువురు సంతాపం



**ప్రజాపక్షం/నల్లగొండ** :ఉప ముఖ్యమంత్రి సిపిఆర్ఓ, సీనియర్ జర్నలిస్ట్ మారబోయిన మధుసూదన్ అకాల మరణం పట్ల సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.మధుసూదన్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆంధ్ర జ్యోతి బ్యూరో ఇన్‌చార్జ్‌గా పని చేసిన సమయంలో అభ్యుదయ భావాలతో జిల్లాలోని ప్రజా సమస్యలను గుర్తించి,నిర్భయంగా వార్తలు రాశారని ఆయన గుర్తు చేశారు.ప్రజా సమస్యల పరిష్కారానికి పత్రికను వేదికగా మలిచిన మంచి జర్నలిస్టును కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.మధుసూదన్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం,సానుభూతిని తెలియజేశారు.

మధుసూదన్ మృతికి గుత్తా సుఖేందర్ రెడ్డి సంతాపం ఉప ముఖ్యమంత్రి సీపీఆర్వోగా పనిచేసిన మారబోయిన మధుసూదన్ అకాల మరణం పట్ల తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.వృత్తి పట్ల నీతి,నిబద్ధత కలిగిన వ్యక్తి మధుసూదన్ అని ఆయన కొనియాడారు.ఉమ్మడి జిల్లా ఆంధ్రజ్యోతి పత్రిక బ్యూరో ఇంచార్జ్‌గా పని చేసిన మధుసూదన్ తనకు అత్యంత సన్నిహితుడని గుత్తా గుర్తు చేసుకున్నారు.మధుసూదన్ కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యం కల్పించాలని ప్రార్థిస్తున్నట్లు మండలి చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు.

**మధుసూదన్ కన్నుమూత –టీయూడబ్ల్యూజే సంతాపం**

ఉప ముఖ్యమంత్రి చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ మారబోయిన మధుసూదన్ తీవ్ర గుండెపోటుతో అపోలో స్పెక్ట్రా ఆసుపత్రిలో మృతి చెందారు. ఆయన మరణం పట్ల టీయూడబ్ల్యూజే (ఐజేయూ)జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి నాగయ్య, డివిజన్ అధ్యక్షుడు జిల్లా యాదయ్య తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.మధుసూదన్ సీనియర్ జర్నలిస్టుగా పలు కీలక బాధ్యతలు నిర్వహించారని,టీయూడబ్ల్యూజే మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సంఘం కోసం విశేషంగా కృషి చేశారని కృష్ణారెడ్డి గుర్తు చేశారు.ఆయన మృతి పాత్రికేయ లోకానికి తీరని లోటని పేర్కొన్నారు.

**మధుసూదన్ మృతికి సిపిఎం సంతాపం**

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సీపీఆర్వో మారబోయిన మధుసూదన్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో గుండె పోటుతో మరణించడం బాధాకరమని సిపిఎం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.పార్టీ రాష్ట్ర నాయకులు,మాజీ శాసనసభ్యులు నంద్యాల నరసింహారెడ్డి,జూలకంటి రంగారెడ్డి,జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి,రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**సీనియర్ పాత్రికేయుడి మృతి పట్ల పలువురు సంతాపం**

**ప్రజాపక్షం/హాలియా:** సీనియర్ పాత్రికేయుడు మారేబోయిన మధుసూదన్ ఆకస్మిక మృతి పట్ల పలువురు సీనియర్ పాత్రికేయులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో హాలియా పత్రిక పాత్రికేయులు పేలపూడి బాలకృష్ణ,అలుగుబెల్లి వెంకట్ రెడ్డి,చాపల శ్రీనివాస్,అట్టెం రవీందర్,నాతి శ్రీనివాస్,చాపల నరేందర్, సముద్రాల దామోదర్,నామాలింగయ్య,సముద్రాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

**మధుసూదన్ మృతి బాధాకరం**

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ వాసి డిప్యూటీ సీఎం సీపీఆర్‌వో మధుసూదన్ సోమవారం ఆకస్మికంగా మృతిచెందడం బాధాకరమని జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు సంతాపం ప్రకటించారు.ఆయన మృతి పట్ల జర్నలిస్టులు ఖాజా హమీదొద్దిన్, రంగా శ్రీనివాస్, ఎండి.అస్లాం, పుప్పాల యాదగిరి, వాడపల్లి రమేష్, కలిమెల నాగయ్య, ఖాజా నాజీమొద్దిన్, జి.వెంకన్న, మనోజ్, అశోక్, రమేష్, జంగా లక్ష్మణ్, కిశోర్, నాగాచారి, మంద సైదులు, గుండా మహేష్, జయరాజు, రాజారాం సతాపం ప్రకటించారు.

## స్వచ్ఛసర్వేక్షన్ ఫీడ్ బ్యాక్‌పై ప్రజలకు అవగాహన



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా సిటిజన్ ఫీడ్ బ్యాక్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్ 2026లో మిర్యాలగూడ ర్యాకింగ్ మెరుగుపరచాలన్నారు. పౌరుల నుంచి ఫీడ్ బ్యాక్ సేకరణ పెంచే మార్గాలు, వార్డుల వారీగా పారిశుద్ధ్య పనుల పురోగతి, ఓడీఎఫ్, గార్బేజ్ ఫ్రీ సిటీ లక్ష్యాల సాధన ప్రతి వార్డులో ఇంటింటి ప్రచారం చేసి పౌరులను స్వచ్ఛ సర్వేక్షన్ యాప్, పోర్టల్ ద్వారా ఫీడ్ బ్యాక్ ఇచ్చేలా చైతన్యపరచాలన్నారు. సమావేశంలో రెవెన్యూ ఆఫీసర్ జ్ఞానేశ్వరి, మెప్మా టీఎంసీ పి.బక్కయ్య, పర్యావరణ ఇంజనీర్ శ్వేతలు ఉన్నారు.

## మిర్యాలగూడ ఇన్‌చార్జి సబ్ కలెక్టర్‌గా జి.వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ ఇన్‌చార్జి సబ్ కలెక్టర్‌గా భూసేకరణ ఆర్అండ్ఆర్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న జి.వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించారు. మిర్యాలగూడలో పనిచేసిన సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్ హైద్రాబాద్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. సోమవారం బాధ్యతలు స్వీకరించగా తహసీల్దార్‌లు, రెవెన్యూ అధికారులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

## మహిళలు, పిల్లల భద్రతపై అవగాహన



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి ఆరు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా మహిళలు,పిల్లల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అడిషనల్ ఎస్పి రమేష్ తెలిపారు.జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ సూచనల మేరకు సోమవారం పట్టణంలోని ఆల్ఫా జూనియర్ కళాశాల,రైల్వే స్టేషన్‌లో షీ టీమ్,భరోసా,ఏహెచ్‌టీయూ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, పిల్లల భద్రతపై అవగాహన కల్పించేందుకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలోడిఎస్‌పి శివరాం రెడ్డి,షీ టీమ్ ఇంచార్జ్ సీఐ కరుణాకర్,ఎస్ఐలు గౌస్,అమ్రిన్,రంగారెడ్డి,కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహా, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగులో వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని అన్నారం గ్రామంలో ఆయిల్ పామ్ రైతు రుషిరెడ్డి కాంతారెడ్డిగో విందమ్మకు చెందిన ఆరు ఎకరాల ఆయిల్ పామ్ తోటను, దామరచర్ల మండలం దిలావర్‌పూర్ గ్రామంలో నాణిక్యనాయక్‌కు చెందిన 4 ఎకరాల తోటలను సోమవారం మిర్యాలగూడ డివిజన్ ఉద్యానవన అధికారి షేక్ నసీమామోహ్రిన్ సందర్శించి వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు అవగాహన కల్పించారు. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక ఆదాయం పొందవచ్చన్నారు. సీజన్‌ను బట్టి పాదుల్లో తగినంత తేమ ఉండేలా నీరు అందించాని, నీటి కొరత ఆకుల ఉత్పత్తి తగ్గి పెరుగుదల సన్నగిల్లి తదుపరి కాలంలో ఎక్కువ మగగెలలు రావడానికి, తద్వారా దిగుబడి తగ్గిపోవడానికి కారణమవుతుందన్నారు. తగినంత తేమా ఉండేలా నీరు డ్రిప్ ద్వారా అందించాన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో ఎల్లయ్య, ఫీల్డ్ ఆఫీసర్ సుధాకర్, సాయి ఉన్నారు.

## జన గణనపై ఎన్యూమరేటర్లకు శిక్షణ




**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** జన గణన 2027పై సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు సోమవారం మండల కేంద్రంలో శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ తరగతిలో తహశీల్దార్ నరేందర్ మాట్లాడుతూ ఎన్యూమరేటర్లు జన గణనను ఎలాంటి తప్పులు దొర్లకుండా చేపట్టాలని సూచించారు. ప్రతి పౌరుడు తమ వివరాలను నమోదు చేసుకోవడం బాధ్యత అని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వర్‌రావు, ఆర్ఐ శ్రీనివాస్, ఎంఎస్ వేణు, మాస్టర్ ట్రైనర్ కట్టనబోయిన శ్రీనివాస్ యాదవ్, సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం పట్టణంలోని 22వ వార్డులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్ట కిషోర్ పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఈద ప్రవీణ్, సైదులు, అడ్వకేట్ నాతి సవీందర్, అశోక్ పాల్గొన్నారు.







**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల వ్యాప్తంగా ఆయా గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని అనాజీపురం గ్రామంలో గ్రామశాఖ అధ్యక్షుడు నర్సయ్య, ప్రధాన కార్యదర్శి అబ్బగాని కాశయ్య ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో జానిమియా, సైదులు పాల్గొన్నారు.
మాచారంలో... మండలంలోని మాచారం గ్రామంలో బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గ్రామ శాఖ అధ్యక్షులు భూక్య సురేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొల్లక బొబ్బయ్య, గంగారపు సతీష్, బొమ్మకంటి లింగయ్య పాల్గొన్నారు.
**సింగారెడ్డిపాలెంలో...** మండలంలోని సింగారెడ్డిపాలెంలో బిఆర్ఎస్ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గ్రామ శాఖ అధ్యక్షులు పేర్ల లింగయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.





**ప్రజాపక్షం/గరిడేపల్లి:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల కేంద్రంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కడియం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భగం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పెండెం శోభరాణి, మాజీ ఎంపిటిసి స్వప్న, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఎస్‌కె నయీం, సీనియర్ నాయకులు పైడిమర్రి సత్యబాబు లు జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు చీమ నరేష్, కుక్కడపు బాబు, ఇమ్రాన్ పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** నేరేడుచర్ల పట్టణ, మండల బిఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ డైరెక్టర్, 3వ వార్డు కౌన్సిలర్ దొండపాటి అప్పిరెడ్డిపాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నడిగూడెం:** బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా నడిగూడెం మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షులు పల్లా నర్సిరెడ్డి పార్టీ జెండాను సోమవారం ఎగురవేశారు. మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అనంతుల ఆంజనేయులు, బొనగిరి ఉపేందర్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సోమవారం మండల కేంద్రంలోని చౌరస్తాలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమావత్ దస్రునాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దస్రునాయక్ బిఆర్ఎస్ జెండాను ఎగరవేశారు. . ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నాయిని శ్రవణ్‌రెడ్డి, రమావత్ దీప్‌లాల్‌నాయక్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బీఆర్ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, అన్నభీమోజు నాగార్జునచారి తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం చరిత్ర బిఆర్ఎస్ పార్టీదేనని మాజీ ఎంపిపి మాడుగుల ప్రభాకర్ రెడ్డి గుర్తు చేశారు. భారత రాష్ట్ర సమితి 26వ ఆవిర్భావ దినోత్సవం పోచంపల్లి పట్టణ కేంద్రంలో ఆపార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఏసిఎస్ చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చిలువేరు బాలనరసింహ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం జెండా ఆవిష్కరణ చేసి పార్టీ ఆవిర్భావ వేడుకలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రేఖ యాదయ్య, జిల్లా నాయకులు ఎస్కే చాంద్, పట్టణ కార్యదర్శి జాడ సంతోష్, ఉప సర్పంచ్ చొప్పరి నరసింహా పాల్గొన్నారు.





**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :**బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్లగొండ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి.జిల్లా పార్టీ అధ్యక్షులు రామావత్ రవీంద్ర కుమార్ పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ అమరుల ప్రాణత్యాగాలతో అమరుల త్యాగాలు,ఉవ్వెత్తున ఎగిసిన ప్రజల ఆందోళనలతో కెసిఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం సాకారమైంది.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి,నల్లగొండ,నకిరేకల్ మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి,చిరుమర్తి లింగయ్య,మాలె శరణ్య రెడ్డి,రేగట్టే మల్లికార్జున రెడ్డి,మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి,నగర పార్టీ అధ్యక్షుడు భువనగిరి దేవేందర్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నకిరేకల్:** పట్టణ కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాచకొండ శ్రీనివాస్ గౌడ్, బి. బలరాం,కొప్పుల ప్రదీప్ రెడ్డి, ప్రగాడపు నవీన్ రావుపాల్గొన్నారు. క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. .ఈకార్యక్రమంలో సిలువేరు ప్రభాకర్,యాతాకుల సోమయ్య,చెరుకు వెంకటాద్రి,చౌగాని శంకర్,ఊట్కూరి ఏడుకొండలు,గుండాల మల్లేష్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/దేవరకొండ;** తెలంగాణ రాష్ట్రానికి బిఆర్ఎస్ పార్టీ శ్రీరామరక్ష అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎంఎల్‌ఏ రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని 16వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ జెండాను రవీంద్రకుమార్ ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో నాయకులు బిల్యానాయక్, కిషన్‌నాయక్, రవికుమార్, కౌన్సిలర్ రుప్లానాయక్, రాజు, మధు, రవి, రాజేష్, జానీబాబా పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండలంలోని రామలక్ష్మి పురం గ్రామంలో గ్రామశాఖ అధ్యక్షుడు అన్నెం అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.




డిండి


రామన్నపేట


చండూరు


మోటకొండూరు


తుర్కపల్లి


నాంపల్లి


నిడమనూరు


గుండాల


పెన్‌పహాడ్


తిరుమలగిరి సాగర్


వేములపల్లి